# సోషలిస్టిక్ సొసైటీ

వేదుల కామేశ్వరరావు

ఖద్దరులాల్చీమీద పడిన బొగ్గు కణాల్ని దులుపుకొంటూ పరధ్యానంగా ఇటూఅటూ చూశారు పరంధామయ్యగారు. వడివడిగా కదులుతున్న రైలుబండిలో నుంచి ప్రకృతి శోభను తిలకిస్తూ ఏవేవో భావసౌధాలను నిర్మిస్తున్నారు, సదరు పరంధామయ్యగారు. ఏడెనిమిది సంవత్సరాలనుంచి రాజకీయాలలో నలిగిన తమ జీవితాన్ని నెమరు వేసుకొంటున్నారు వారు. మొట్టమొదట ఒక గ్రామపెద్దగా, తరువాత తాలూకా పార్టీ కార్యదర్శిగా, వెనువెంటనే జిల్లానాయకులలో ఒకరుగా, తుట్టతుద కొక జిల్లానాయకుడుగా పేరు సంపాదించుకోడానికి ఆయన పొందిన వ్యయప్రయాసలను తలుచుకొంటూ శూన్యంలోకి సుదీర్ఘంగా చూస్తున్నా డాయన.

ఎదురుబెర్తుమీద నడుంవాల్చిన ఒక కాలేజీ విద్యార్థి లేచి, ఒకప్రశ్న వేశాడు. పరంధామయ్యగారిని ఆ ప్రశ్నకు సమాధానం చెప్పమని అడిగాడు. మొహానికి పేపరు అడ్డంపెట్టుకొని చదువుకొంటూన్న ఒక గ్రామస్థుడు పేపరులో విశేషాలు కనబడక పరంధామయ్యగారివైపు ఆత్రంగా చూశాడు. మూలసీటులోని వర్తకు డొకడు మిరపకాయల సంచీలతో సహా వారి సాన్నిధ్యానికేతెంచి సావధానంగా వారి ఉపన్యాసాన్ని వినటానికి చెవులు రిక్కించాడు. ''మా మహిళాభ్యుదయం మాటేం జేశారు?'' అన్నట్టుగా ముందు సీటులో కూర్చొన్న ఒక ఆదర్శవనిత ఓ చిరునవ్వు విసిరింది.

ఇంతమంది ఇన్ని విధాలుగా తమ సందేశాన్ని వినటానికి తహతహ లాడుతుంటే ఆయనకు మాత్రం అంతకన్న కావలసినదేముంది? ప్రకృతి సౌందర్యంలో నుంచి ఉపన్యాస ధోరణిలోకి సర్దుకోవటానికి ఆయనకు ఎక్కువ కాలం పట్టలేదు. గొంతుక కొంచెం సవరించుకొని ఎదురుగావున్న కాలేజీ విద్యార్థివైపు చూసి, ''ఏమిటి మీరన్నారు?'' అన్నాడాయన.

''ఎబ్బే ఏంలేదండి. భారతదేశంలో నినాదాలకూ, తీర్మానాలకూ ఉన్న విలువ ఆచరణలోకి వచ్చేటప్పటికి అంతర్ధానమవుతున్నది.'' అనుమానిస్తూనే పాపం ఆ అబ్బాయి సమాధానం చెప్పాడు.

''అదే తప్పంటాను. భారతదేశపు ప్రతిభ భారతీయులకే తెలియకపోవడంకన్న శోచనీయమైన విషయం మరొకటిలేదు. మన నాయకులు మనకిస్తున్న సలహాలను మనమే ఆచరణలోకి తీసుకు రాలేక పోతున్నాం. సమాజ సముద్ధరణ కోసం గాని, సాంఘిక సంక్షేమం కోసం గాని, జాతీయ వికాస మార్గాలకు గాని ప్రజలు ఏ మాత్రం ఆతురత చూపకపోవడం కూడా మనకు సిగ్గుచేటైన విషయం. ప్రభుత్వం చేస్తూన్న ప్రతిమంచిపనికీ మనం సహాయం చెయ్యాలి. అప్పుడే మన నెహ్రూ పండితుని సోషలిస్టు సమాజం తెచ్చుకో గలుగుతాం. భారతదేశ ప్రతిభను దిగంతాలూ వ్యాపించేలా మ్రోగిస్తాం.''

మిరపకాయల వర్తకుడు వాటి తాలూకు ఘాటును మర్చిపోయాడు. గ్రామస్తుడు సంతృప్తిగా నవ్వాడు. ముందు సీటులోని భారతవనిత గాలికి తప్పుకొన్న పమిటను సర్దుకోవటం మర్చిపోయింది. పరంధామయ్యగారి మాటలు వారందరికీ బాగా నచ్చినయ్. కాలేజీ విద్యార్థిమాత్రం తన్ను కాదనట్టుగా అటువైపు తిరిగి పడుకొన్నాడు.

''అయితే ద్వితీయ పంచవర్ష ప్రణాళికలో

స్త్రీ జనాభ్యుదయానికి ఏమయినా కేటాయించారాండి?" ఆమె అడిగింది సన్నంగా.

"ఒకమూల దేశమంతా అభ్యుదయ పంథాలో నడవటానికి సిద్ధంగా వుంటే ఇంకా కేటాయించటమేమిటమ్మా? ఈ ద్వితీయ పంచవర్ష ప్రణాళికలో స్త్రీ జనాభ్యుదయానికి బోలెడంత (?) ప్రయత్నంజరుగుతున్నది. అయితే మన ఈ లక్ష్యాలన్నింటినీ కేంద్రీకరించి సోషలిష్టిక్ సొసైటీ...."

"అయితే ఈ వర్తకులమీద కొంచెం టాక్సులు ఎక్కువ గడుతన్నారు; దీనికి మార్గం ఏమీలేదాండి బాబూ?" ఉండబట్టలేక మిరపకాయల వర్తకుడు తహతహలాడుతూ అడిగేశాడు, సమాధానంకోసం తయారుగాకూర్చొంటూ!

పరంధామయ్యగారు కంఠం సర్దుకొన్నారు. "ఈ టాక్సులయొక్క ఉద్దేశ్యం నీకు బాగా అర్థమయినట్టు తోచదయ్యా, టాక్సులు ఎవరికి ఇస్తున్నావు? గవర్నమెంటుకు ఇస్తున్నావు. గవర్నమెంటంటే ఎవరు? ప్రజలు! గవర్నమెంటు ఏంచేస్తోంది? మీ రందరూ ఇచ్చిన టాక్సులన్నీ కలిపి రోడ్లు నిర్మిస్తోంది. ప్రాజెక్టులు నిర్మించబోతోంది. ఇవన్నీవస్తే మీకే లాభంకలుగుతుంది. ప్రయాణం సుఖంగాజరిగి ఖర్చులుతగ్గి, మీ లాభాలు పెరుగుతవి. మన సోషలిస్టు సమాజం ఏర్పడిందంటే ఇంక మనం ఆలోచింపవలసిన పనిలేదు. అందరికీ పురోభివృద్ధి కలుగుతుంది!"

కాబోలుననుకొన్నట్టున్నాడు మిరపకాయల వర్తకుడు, మరి మాట్లాడలేదు. ఏదో పొరబాటు చేసినవాడిలా ముఖంపెట్టి కూర్చొన్నాడు.

"అయితే ఇంకా కొన్ని విషయాలున్నయ్. మనం స్వాతంత్ర్యం సంపాదించినప్పట్నుంచీ, భారతదేశంలో ఏదో ఒకమూల అభ్యుదయం సాగుతూనే వుంది. ప్రాజెక్టులు నిర్మించాలి. నిరుద్యోగ సమస్య తీర్చాలి. చిన్నఉద్యోగుల వేతనాలు పెంచాలి. విద్యావ్యాప్తి జరగాలి. వ్యాపారంలో అభివృద్ధి పొందాలి!....అయితే వీటన్నింటికీ కొంతకాలం పడుతుంది. అది గ్రహించి మనం మన ప్రభుత్వానికి సహకారం ఇవ్వాలి. ఇంకొక్క చిన్నసమస్య ఉంది. తిండి లేనివాళ్లసంఖ్య కొంచెం పెరుగుతోంది. సోషలిస్టు లక్ష్యం సిద్ధించిందంటే....దేశంలో తిండి లేనివాళ్లు ఎవరూ వుండరు. చూడటానికి మచ్చుకైనా ముష్టివాళ్లు కనుపించరు...."

"....కానరే మము బీదలా....బాబూ ధర్మం చెయ్యండి" తియ్యగాపాడుతూ పరంధామయ్యగారి ముందుకువచ్చి చెయ్యిచాపింది ముష్టిపిల్ల ఒకర్తె!

పరంధామయ్యగారు గతుక్కు మన్నారు. "ఫో, ఫో" అందామనుకొని, మళ్ళీ జ్ఞాపకం తెచ్చుకొని, జేబులోకి చెయ్యి సారించారు. ముష్టిపిల్ల జాలిగా నిలబడింది ఆశతోచూస్తూ.

"అయితే, నీవు కూలిపని చేసుకొని బ్రతకలేవా? ఈ జీవితం నీకేం సుఖం చెప్పు? ఒకమూల దేశంలో అనేక ప్రాజెక్టులు నిర్మిస్తున్నారు. మీ రింకా ఈ ముష్టిపనే పెట్టుకొంటే ఎలా? వెళ్ళి ఏదైనా పనిలో చేరి సుఖంగా కాలం గడుపుకో" అతి హుందాగా శెలవిచ్చారు పరంధామయ్యగారు.

"ఇంకా ఈ బతుకులో నాకు సుఖం ఏంటి బాబూ? మాయయ్య బెంగెట్టుకోని ఏనాడైతే చచ్చిపోనాడో ఆనాడే నా బతుకిట్టా మారింది బాబయ్యా!" ముష్టిది కన్నీరు కారుస్తూ పలికింది.

షావుకారు మెరపకాయల చెయ్యి కళ్ళకద్దుకుని కొద్దిగా దుఃఖించాడు. పల్లెటూరి ఆసామీ మీసాల మధ్యనుంచి విచారాన్ని సూచించాడు. పరంధామయ్యగారు అదోలా ముఖంపెట్టి బయటకు చూస్తున్నారు ముష్టిపిల్ల తన చరిత్ర చెప్పటం మొదలుపెట్టింది.

"నా చిన్ననాడే మా యమ్మ సచ్చిపోనాది బాబూ. మా యయ్యే నన్ను పొద్దత్తమానూ ఆడించి పెంచేడంట. ఆయ నెవరో కాంగ్రేసాయన పొలం మూడెకరాలు ఎగసాయం గట్టి, కాడెద్దులూ గట్రాతో రైతులాగుండేవాడంట మా బాబు. నాకు గేన మొచ్చేవరకూ ఎగసాయం మీదే బతికేడంట.

మూడేళ్ళ కిందటొచ్చిన గాలివోనకు మా ఇల్లంతా సితైపోనాది బాబూ. నాకు బాగా గేపక మున్నాది. సలికి గజగజా వొణికిపోనాను.

ఆకులు మీదబడిపోతున్నాయి, గోడ కేలాడ గట్టిన లాంతరు కూంతా ఆరిపోనాది. యీదిలో కెళ్లటానికైనా ఎలుతురు లేదు మా బాబు నన్నెత్తుకొని ఎట్టాగోబయటికొచ్చినాడు బాబూ. నేకపోతే ఆ గుడిసెలో బడి చచ్చేవోళ్లమే.''

''అట్టాంటి సమయమొచ్చినా ఆ పొలం గల నా బాబుకు మామీద జాలిలేకపోనాది. పొలంలో పంటంతా పాడైపోయింది. సిత్తివ్వ డానికి చిల్లి గవ్వైనా మా బాబు చేతిలో లేదు బాబూ. మా బాబు ఆయన కాళ్ళట్టుకొని బతిమాలిండ్రు. ''ఛీ! ఛో'' అని ఆయన బూటుసులు కాలితో మా బాబును తన్నుతుంటె నాకి చారమాగనేదు బాబూ. అయిదేళ్ళ బుడతని బాబూ నేనప్పుడు మా బాబు ఆడి ఖర్మ కాలి పోబట్టి ఆళ్ళెవరూ; ఆ కమ్మూనిట్టులతో మాట్టోడినోడంట. అందుకుగానేమో, ఆ బాబుకు కోపమొచ్చినాదంట.

మా బాబు ఏడుస్తుంటే నాకిచారమాగనే దండి. ఇద్దరమూ బోరుమంటూ ఏడుత్తూ ఈధిలోంచి ఎళ్తావుంటే అక్కడోళ్ళంతా కన్నీరెట్టుకొన్నారు. ఎంత మంది జాలిచూపిత్తే మాత్రం ఏం పెయోజనం బాబూ?

కల్లనీల్లు తుడుచుకొంటూ మాయయ్య నన్నెత్తుకొని ఏలూరు టేషను కొచ్చిండ్రు. కూలో నాలో జేసుకు బతుకుదా మనుకొనేటప్పటికి కాళ్ళూ సేతులూ పడిపోయినాయి అవిటోడి నెట్టుకొని ఆ టేషనులో రెండు పొద్దులు గడిపాను బాబూ. ఆకలిబాధకు పడలేక కని పించి నోరినల్లా నోరిడిచి అడిగేనండి. రోజూ రెండు మూడణాలు దొరుకుతుండాయి. ఇంతలోనే మాబాబు బెంగెట్టుకొని సచ్చిపోయిండ్రు.''

ముష్టిపిల్ల ఏడుస్తూ చెబుతోంది. ''ఒక నెల దినాలనుంచి ఇట్టాగే రైలులో ముట్టెత్తుకొంటున్నాను బాబూ. ఒక పూట తింటే మూడు పొద్దులు పత్తుండాల్సిన బతుకులు బాబూ మావి. ఆయనెవరో ఆ కాంగ్రేసాయ నిప్పుడు పెద్దోడైనాడంట ఆయన కాళ్ళట్టుకోమని మా యూరోళ్లు సెపుతుండ్రు బాబూ. మరిగంటి, నా మనసుకిట్టంలేదండి. ఆ బాబు జాలిగలవోడైతే మా బాబును పొట్టనెందుకెట్టుగుంటాడు?అయినా, అదంతా నాకర్మం బాబూ మా బతుకులిల్లా ఎల్లిపోవాల్సిందేగాని ఎవరు చూత్తారు బాబూ....?'' ముష్టి పిల్ల చెప్పకు పోతున్నది....

....పావుకారుకు మిరపకాయల చెయ్యి అవసరం లేకుండానే విచారం పొంగి పొంగి వచ్చింది పల్లెటూరిఅసామీ మీసాలతో కాకుండా కళ్లతోనే విచారాన్ని వ్యక్తపరిచాడు. అభ్యుదయ మహిళ పమిట కొంగుకోసం వెతికింది, కళ్ళనీళ్లు తుడుచుకోవటంకోసం కాబోలు!

పరంధామయ్యగారికి కళ్ళ నీళ్లు రాలేదు. కోపంగా లేచారు తొట్రుపాటుతో ఒక్కసారి ఖద్దరు సంచీ పుచ్చుకొని గుమ్మంలోకి తొంగి చూశారు. ''ఒకస్టేషన్న, ఎంత చిన్నదైనాసరే'' రావటంకోసం చూస్తూ దిగాలుగా సీటులో చతికిలపడ్డారు పరంధామయ్యగారు! ★

---

(10-వ పెజీ తరువాయి)

మరిచిపోతున్నారా యీ పెద్దలు అన్పిస్తుంది. శరణాలయాలూ, రెస్క్యూగృహాలూ ఎన్నైనా స్థాపించవచ్చు. అక్కడ పతితులకీ దిక్కులేని వారికీ ఆధారం కల్పించవచ్చు. కాని ప్రస్తుత పరిస్థితుల్లో పతిత అవడమే లాభదాయకం, అనాథ అవడవే చక్కని అవకాశంగా కన్పిస్తూంది. తిండీ బట్టా యిచ్చి వృత్తి విద్య నొక దాన్ని నేర్పించే ప్రయత్నం అయినా చేస్తారని తెలుస్తే....పతిత అయే అవకాశం దొరుకుతే బాగుండును అన్పిస్తుంది, అన్నానికి లేనివాళ్లకి. అందులో తప్పేం వుంది?

వ్యభిచారం చట్టవిరుద్ధం, చట్టాన్ని ధిక్కరిస్తే శిక్ష వేస్తారు అన్న భయం వుంటే ఫలితాలు యింకోలా వుంటాయి.ఒకసారి గడ్డితిన్నా యింకోసారేనా జంకుతారు అలా కాకుంటే రక్షణ గృహంలో పెడతారు, హాయిగా వుండొచ్చు- యిక్కడ యింట్లో ఏం స్వర్గసౌఖ్యాలు అనుభవిస్తున్నాం కనుక, అనిపిస్తే- అసలు నైతిక పునరుద్ధరణ అనేది- నేతిబీరకాయ. ఇంతకీ బైబిలు కథలోలా జరగాలంటే .... ఎవరూ వేయడం మొదటి రాయి? —(రుద్రాణి)